క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలి



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

వాంకిడి: పర్యావరణానికి తీవ్ర నష్టం కల్పిస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని డీఆర్డీవో దత్తారామ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, లెక్చరర్లతో కలిసి కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యం, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

వాంకిడి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సవాతి, దొడ్డిగూడ, చౌపన్‌గూడ, పిప్పర్‌గోంది, వాంకిడి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. మండల వైద్యాధికారి వినయ్ ఉప్రే ఆధ్వర్యంలో 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. స్వచ్ఛత దాని ప్రాముఖ్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డీఆర్డీవో దత్తారాం వైద్య శిబిరాలను ఆకస్మికంగా సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో జావిద్, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, వైద్య సిబ్బంది క్రిస్టియాన, అనసూయ, మమత, సౌమ్య, రుక్మిణి, భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇంటిబాట



ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు దసరా సెలవులు రావడంతో మంగళవారం జిల్లా కేంద్రంలోని వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులు పండుగకు ఇంటికి వెళ్లారు. ఈ నెల 2 నుంచి 14 వరకు దసరా సెలవులు ఉండటంతో తల్లి దండ్రులతో కలిసి ఇంటిబాట పట్టారు. దీంతో బస్సులు కిటకిటలాడాయి.

దసరా సందడి ప్రారంభం



బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

ఆసిఫాబాద్‌అర్బన్: దసరా సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. నేటి నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దసరా సందర్భంగా ఆర్టీసీ వివిధ రూట్లకు ప్రత్యేక బస్సులు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో జోనల్ స్థాయి పోటీలను డీటీడీవో రమాదేవితో కలిసి ప్రారంభించారు. గిరిజన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, చెస్, వాలీబాల్ అండర్ 17 బాల బాలికల పోటీల్లో 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 248 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. డీఎస్‌వో మీనారెడ్డి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని కౌటాల మండలం గుడ్లబోరి గ్రామ శివారులో ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణం నిర్వహణను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. వానాకాలంలో పిచ్చిమొక్కలు పెరిగి బురదమయంగా మారుతోంది. దీంతో క్రీడాకారులు ఎవరూ క్రీడా ప్రాంగణం వైపు కన్నెత్తి చూడడం లేదు.

కౌటాల మండలం తలోడి గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని గ్రామానికి దూరంగా పంట పొలాల మధ్యలో ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో వానాకాలంలో వరద నీరు నిలిచి ఉంటుంది. దీంతో గ్రౌండ్‌కు వెళ్లేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపడం లేదు. దీంతో అధికారులు అందించిన స్పోర్ట్ కిట్లు మూలకు పడ్డాయి. పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం, నిధులు దుర్వినియోగమవుతున్నాయని వాపోతున్నారు.





కౌటాల మండలం కనికి గ్రామ శివారులో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణంలో ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగాయి. భారీ వర్షం కురిసినప్పుడు క్రీడా ప్రాంగణంలో వరదనీరు నిలిచి స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తోంది. క్రీడా ప్రాంగణం ఎదుట సమాధి ఉండడంతో అటుగా ఎవరూ వెళ్లడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కేవలం తెలంగాణ క్రీడా ప్రాంగణం అనే బోర్డును మాత్రమే ఏర్పాటు చేశారు తప్పా కనీసం క్రీడా సామగ్రి కూడా పంపిణీ చేయలేదు.

ఆటలకు దూరం..!



నిరుపయోగంగా గురుడుపేట జీపీలోని కోయగూడ క్రీడా ప్రాంగణం

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- క్రీడా కిట్లు పంపిణీ చేసినా మూలకే..
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. ఇందుకు రూ.లక్షల నిధులు మంజూరు చేసింది. కానీ క్రీడా మైదానాల్లో చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఒక్కో మైదానానికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు వరకు ప్రభుత్వం వెచ్చించింది. ఎకరం విస్తీర్ణంలో ఉండే క్రీడామైదానంలో ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ వంటి ఆటలు ఆడే విధంగా రూపొందించారు. క్రీడా ప్రాంగణంలో స్థలాన్ని బట్టి చుట్టూ 200 -300 వరకు మొక్కలు నాటాల్సి ఉంది. ఇందుకు ఉపాధిహామీ నుంచి రూ. 55 వేల వరకు ఖర్చు చేసుకోవచ్చు. భూమి చదును, మట్టి వేయించడం, మొక్కలు నాటడం.. ఇలా అన్ని పనులకు రూ.2లక్షలకు పైగా ఖర్చుకు అవకాశం కల్పించారు. కానీ చాలా చోట్ల పనులు అంతంత మాత్రంగానే చేపట్టారు.

కిట్లు సరే.. ఆడేదెక్కడ..?

జిల్లా వ్యాప్తంగా 1,102 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 902 చోట్ల స్థలాలు గుర్తించారు. మిగిలిన 200 క్రీడా ప్రాంగణాలకు స్థలాలను గుర్తించాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 878 క్రీడా ప్రాంగణాలు క్రీడలకు అనుకూలంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రీడా ప్రాంగణాల కోసం గత ప్రభుత్వం జిల్లాకు 878 క్రీడా యూనిట్లను పంపిణీ చేయడంతో ఒక్కో క్రీడా కిట్టులో క్రికెట్, వాలీబాల్ కిట్లు, టీ -షర్టులు, మూడు జతల డంబెల్స్ వంటివి క్రీడాకారులకు అందించారు. ఇంతవరకు బాగానే ఉన్నా క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ఆదిలో అధికారులు హడావుడి చేయడంతో దాదాపు అన్నిచోట్ల సరైన స్థలం లేకపోవడంతో పాఠశాలల మైదానాల్లోనే ఏర్పాటు చేశారు. మరికొన్ని గ్రామాల్లో సరిగా చదును చేయకపోవడంతో రాళ్లు, రప్పలతో ఆడలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. శాశ్వత ప్రాతిపదికన మన్నికగా ఉండేలా చేయాల్సిన పనులను స్థానిక ప్రజా ప్రతినిధులే గుత్తేదారులుగా మారి నామమాత్రంగా చేయడంతో చిన్నాపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి.

ఊరికి దూరంగా..

ప్రజలకు అందుబాటులో మైదానాలు ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు నిర్ణయించింది. కానీ అధికారుల ఆర్భాటంతో అనేక చోట్ల ఆయా గ్రామాలకు కిలోమీటరు, రెండు కిలోమీటర్ల దూరంలో మైదానాలు ఏర్పాటు చేశారు. దీంతో అటు వైపు ఎవరూ వెళ్లకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ప్రభుత్వం క్రీడా పరికరాలు అందించినా అనువైన స్థలాలు లేకపోవడంతో అవి మూలకు పడ్డాయి. పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయకపోవడంతో క్రీడలకు యువత దూరంగా ఉంటున్నారు. నిధుల కొరతతో జిల్లాలోని కొన్ని చోట్ల క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, సౌకర్యాల కల్పన పనులు ముందుకు సాగడంలేదని అధికారులు పేర్కొంటున్నారు.

క్రీడా ప్రాంగణం లేదు..



అధికారులు చాలా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కానీ మా ఊరిలో క్రీడా మైదానం ఏర్పాటు చేయలేదు. మా గ్రామం నుంచి యువకులు కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. చాలా మంది వాలీబాల్, క్రికెట్ క్రీడాకారులున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మా గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి.

– వసంత్, కబడ్డీ క్రీడాకారుడు, యాపలగూడ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



దహెగాం: ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది



కౌటాల: అభినందిస్తున్న కరస్పాండెంట్ యాదగిరి

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత మంగళవారం తెలిపారు. ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన అండర్ 17 ఫుట్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థినులు నికాడి రవళిక, చాపిల శ్రావణి, ఎల్కరి రాజేశ్వరీలు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈనెల 6 నుంచి 8 వరకు మెదక్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్17 క్రికెట్‌కు ఎంపిక..

కౌటాల: మండల కేంద్రంలోని మయూరి విద్యాలయం విద్యార్థులు అండర్ 17 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు వారిని మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ యాదగిరి, ప్రధానోపాధ్యాయులు సంతోష్ అభినందించారు. కాగజ్‌నగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 జిల్లా స్థాయి క్రికెట్ సెలెక్షన్స్‌లో పాఠశాల విద్యార్థులు డి.తరుణ్, ఎం.హర్షిత్‌లు ప్రతిభ కనబర్చారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

సర్టిఫికెట్ల పరిశీలన సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

ఆసిఫాబాద్‌రూరల్: నేటి నుంచి జరుగనున్న డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన సక్రమంగా నిర్వహించాలని డీఈవో యాదయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు. డీఈవో మాట్లాడుతూ కమిటీ బృందాలను అనుభవజ్ఞులైన ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు చెక్ లిస్ట్, రెండు సెట్ల అటెస్టెడ్ సర్టిఫికెట్లు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. పోస్టుకు 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల మొబైల్‌కు మెసేజ్ వస్తుందని సంబంధించిన ప్రింటెడ్ కాపీ కూడా తీసుకురావాలన్నారు. ఎక్కువ పోస్టులకు ఎన్నికైన అభ్యర్థులు వద్దనుకున్న పోస్టుకు సంబంధించిన డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. జిల్లాలో మొత్తం 1023 మందికి ఈ నెల 5వ తేదీ లోపు వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్ బాబు, కోఆర్డినేటర్ మధుకర్, ఎస్‌వో శ్రీనివాస్, ఎంఈవో, హెచ్ఎంలు పాల్గొన్నారు.

డబ్బులు ఇప్పించాలని ఆందోళన

కాగజ్‌నగర్‌రూరల్: దుర్గామాత కమిటీకి సంబంధించిన డబ్బులను ఇప్పించాలంటూ మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన యువకులు ఆందోళన చేపట్టారు. అదే గ్రామానికి చెందిన కోట శంకర్ గత ఏడాది దుర్గామాత కమిటీకి సంబంధించిన రూ.95వేలను వాడుకున్నాడని డబ్బులు వెంటనే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు వాడుకున్నట్లు బాండు పేపర్ కూడా రాసి ఇచ్చాడని, కానీ డబ్బులు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఆందోళనతో కాగజ్‌నగర్ -దహెగాం మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు.

ఎస్‌జీటీయూ నూతన కార్యవర్గం



శంకర్

ఆసిఫాబాద్‌రూరల్: సెకండరీ గ్రేడ్ టీచర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని దీక్ష భూమి కమిటీ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చైతన్య కుమార్, గౌరవ అధ్యక్షుడిగా శ్రావణ్, సలహాదారులుగా తిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా భూక్య శంకర్, నాగోరావు, మహేందర్, జిల్లా కార్యదర్శులుగా సచిన్, సంజీవ్, శివాజీ, భాగ్యలక్ష్మి, ప్రచార కార్యదర్శిలుగా రత్నం శివ ఎన్నికయ్యారు.

'మానవ మృగానికి కఠిన శిక్ష విధించాలి'



సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మండలం బూర్గుడలో జరిగిన మైనర్ బాలికపై అత్యాచార ఘటనకు కారకుడైన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. రాజేంద్రప్రసాద్, వినోద్‌కుమార్, శ్రీనివాస్, లింగమూర్తి, గ్రామస్తులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అప్పగింత



సెల్‌ఫోన్‌లు అప్పగిస్తున్న ఈజ్‌గాం పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మూడు సెల్‌ఫోన్‌ను ట్రేస్‌చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. కాపువాడకు చెందిన హరీశ్, బోడపల్లికి చెందిన శ్రీనివాస్, ఆకాశ్‌లు సెల్‌ఫోన్‌లను పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్‌చేసి మంగళవారం బాధితులకు అప్పగించామన్నారు. సెల్‌ఫోన్‌ల ట్రేసింగ్‌లో కానిస్టేబుల్ నయీం ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



పరామర్శిస్తున్న మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రావు

బెజ్జూర్: మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన తెల్లి బాపు అనే వ్యక్తికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు పాక్షికంగా దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం పత్తి పంటకు తైవాన్ పంపు ద్వారా పిచికారీ చేయడానికి పెట్రోల్ తీసుకురాగా చెయ్యి జారీ పెట్రోల్ బాటిల్ కట్టెల పొయ్యిలో పడింది. దీంతో మంటలు చెలరేగాయి. వాటిని ఆర్పివేసేందుకు ఇంట్లో బాపు కూతురు శంకరమ్మ ప్రయత్నించగా ఆమె చేతులు కొంత కాలిపోయాయి. దాదాపు రూ.1లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు పరామర్శించారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రదర్శన ఇస్తున్న కళాజాత బృందం

చింతలమానెపల్లి: గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రవీంద్రనగర్ శాఖ మేనేజర్ కిరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. బ్యాంకు సేవలపై కళాబృందం అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ బ్యాంకులో ప్రతీ ఒక్కరు ఖాతాలు కలిగి ఉండి బీమా చేయించుకోవాలన్నారు. ఏపీఎం తిరుపతి, వీవో కేడ్‌కార్ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

బడుల్లో బతుకమ్మ సంబరాలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. విద్యార్థులు బతుకమ్మలు పేర్చి సంస్కృతిక నృత్యాలు చేశారు. ఆట, పాటలు, డీజే చప్పట్లతో బడుల్లో సందడి నెలకొంది. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించినట్లు పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు.



వాంకిడిలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలలో..



రెబ్బెన: కస్తూరిబా విద్యాలయంలో..



ఆసిఫాబాద్: సరస్వతి శిశుమందిర్‌లో..



బెజ్జూర్: బతుకమ్మలతో ఉపాధ్యాయులు



దహెగాం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



బతుకమ్మతో డీటీడీవో రమాదేవి

క్రీడాకారులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



పోటీలు ప్రారంభిస్తున్న సీనియర్ మెడికల్ అధికారి మురళీమోహన్

రెబ్బెన: ఏరియాలో పని చేస్తున్న సింగరేణి క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ కోల్ ఇండియా స్థాయిలో పతకాలు సాధించాలని గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీ సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ మురళీ మోహన్ అన్నారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో డిపార్టుమెంటల్ ఫుట్‌బాల్ పోటీలను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంస్థలో పని చేసే ఉద్యోగులు తమ ప్రతిభ ద్వారా సింగరేణి కీర్తిని దేశవ్యాప్తంగా చాటాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

గడువు తేదీ పొడిగింపు

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ 2024 -25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ అడ్మిషన్‌లకు ఇంటర్ తత్సమాన అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 15వ తేదీ వరకు గడువు పెంచినట్లు కళాశాల కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.